

మతంతో రాజకీయం సరికాదు : డీసీఎం

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో మతం ఉండొచ్చు గానీ.. మతంతో రాజకీయాలు చేయడం సరికాదని ఉపముఖ్యమంత్రి డీకే శివ కుమార్ పేర్కొన్నారు. అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా 16 రాష్ట్రాలు సెలవు ప్రకటించాయని, రాష్ట్రంలోనూ అమలు చేయాలన్న బీజేపీ డిమాండ్‌పై ఆయన స్పందించారు. ఆదివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ తాము భక్తిని పాటిస్తామని, మతాన్ని ప్రచారం చేయబోమన్నారు. ఆలయాల్లో ఎలాంటి ఆచారాలు పాటించాలో వాటిని అమలు చేస్తామన్నారు. పూజలు, కైంకర్యాలు కొనసాగిస్తామని తమకు ఎవరూ సలహా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.



చింతామణి తహసీల్దార్ సర్కిల్లో ఏర్పాటైన శ్రీరాముడి విగ్రహం

రాష్ట్రమంతా రాముడి సందడి

- రామలల్లా ప్రతిష్ఠాపన వేళ.. హై అలర్ట్
- సెలవుకు నో చెప్పిన సీఎం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- కూడళ్లలో కాషాయం కళకళ

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాలనాటి కల నెరవేరేలా అయోధ్య రామమందిరంలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపనకు మరికొన్ని గంటలే మిగిలింది. రాష్ట్రమంతటా పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారం మధ్యాహ్నం నాటికే బెంగళూరు సహా అన్ని జిల్లా కేంద్రాలు, పట్టణాలు, ఆధ్యాత్మిక కేంద్రాల వద్ద కాషాయం కళకళలాడింది. రాముడి హోర్డింగులు, కాషాయం తోరణాలు రెపరెపలాడాయి. కాషాయం కండువాలు విక్రయించే దుకాణాల వద్ద బారులుతీరి కొనుగోలు చేశారు. రాష్ట్రమంతటా పండుగ వాతావరణం చోటు చేసుకోగా మరోవైపు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు సిద్ధమైంది. రాష్ట్రంలో ఎక్కడా హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య తుమకూరులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సోమవారం సెలవు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కానీ దేవదాయశాఖకు అనుబంధమైన అన్ని ఆలయాల్లోనూ పూజలు కొనసాగుతాయన్నారు. రాష్ట్రమంతటా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించామని వెల్లడించారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి పరమేశ్వర్ జిల్లా ఎస్పీలు, ఉన్నతాధికారులతో మరోసారి సమీక్షించారు. రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన వేళ ఊరేగింపులు, ర్యాలీలు వివాదాలు కాకుండా చూడాలని ఆదేశించారు. బెళగావిలో ర్యాలీకి అక్కడి పోలీసు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. కాగా పలు చోట్ల ఏర్పాటు చేసిన రాముడి హోర్డింగులు, కటౌట్లు, బ్యానర్లు తొలగించేలాంటి చర్యలు చోటు చేసుకోవడంపై వివాదాలకు కారణమవుతుండగా పోలీసులు కట్టడి చేశారు. ప్రత్యేకించి చిక్కమగళూరు, ఉడుపి, ఉత్తర కన్నడ, దక్షిణకన్నడ జిల్లాల పరిధిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరోవైపు యువత వాహనాలకు రామ, హనుమ జెండాలతో చక్కర్లు కొడుతుండగా కాషాయం టీ షర్టులకు సర్వత్రా డిమాండ్ నెలకొంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి దాకా రామాలయాలలో ప్రత్యేక పూజలు జరిపేందుకు ఆలయ కమిటీలు, హిందూ సంఘాలు ఏర్పాటు చేశాయి. మధ్యాహ్నం 12 గంటలకు రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు పలు సంస్థలు ఏర్పాట్లు చేశాయి.



మెజెస్టిక్ సమీపాన కాషాయం జెండాల కోసం ఎగబడిన జనం

అయోధ్యకు తరలిన దేవెగౌడ కుటుంబం

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన సమారంభంలో పాల్గొనేందుకు మాజీ ప్రధాని దేవెగౌడ ఆదివారం తరలి వెళ్లారు. బెంగళూరు నుంచి ప్రత్యేక విమానంలో భార్య చెన్నమ్మ, కుమారుడు కుమారస్వామి, మనవడు నిఖిల్‌తో కలసి సాయంత్రం బయల్దేరారు. రాత్రికి వా రు అయోధ్యకు చేరుకోనున్నారు.



విమానంలో మాజీ ప్రధాని దేవెగౌడ కుటుంబం



చింతామణి మారుతి సర్కిల్లో ఏర్పాటు చేసిన భారీ కటౌట్

చింతామణిలో పండుగ వాతావరణం

చింతామణి, జనవరి 21: అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన నేపథ్యంలో చింతామణి పట్టణ వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. పలుచోట్ల శ్రీరాముడి కటౌట్లు, విగ్రహాలు ఏర్పాటు చేశారు. పలు ఆలయాల్లో విశేష పూజలకు కార్యక్రమాలు సన్నద్ధం చేశారు. పట్టణంలోని ప్రముఖ కూడళ్లలోని తహసీల్దార్ సర్కిల్, బెంగళూరు సర్కిల్, మారుతి సర్కిల్, గజానన సర్కిల్, బాగేపల్లి సర్కిల్, ఆజాద్ చౌక్, చేళూరు సర్కిల్, కోలారు సర్కిల్ తదితర చోట్ల బంటింగ్స్‌తోపాటు విద్యుద్దీపాలకరణ, కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే బీజేపీ నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం సీతారామ కల్యాణోత్సవం, శోభాయాత్రను నిర్వహించనున్నారు. కన్నంపల్లిలోని వీరాంజనేయస్వామి, పంచముఖి ఆంజనేయస్వామి దేవస్థానాల్లో ఆదివారం నుంచి సోమవారం మధ్యాహ్నం దాకా రామకోటి కార్యక్రమం కొనసాగనుంది. రాజీవ్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 7 గంటలకు బెంగళూరు రుద్రాక్ష నాట్యాలయకు చెందిన విదూషి పద్మని ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో శ్రీరామచరితం నృత్య రూపకం జరగనుంది. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వేల లడ్డూలు పంపిణీ చేయనున్నారు. రాయల్ సర్కిల్ ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ నేతృత్వంలో భక్తులకు లడ్డూలు పంపిణీ చేయనున్నారు.



రామమందిర నమూనా ఆలయం

గిరినగర్‌లో అయోధ్య రామమందిర నమూనా

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గిరినగర్ వాసవి దేవస్థాన ప్రాంగణంలో అయోధ్య రామమందిర నమూనాను ఏర్పాటు చేశారు. సోమవారం శ్రీరాముడికి అభిషేకం, విశేష పూజలు, భజనలు నిర్వహించనున్నారు. 24 అడుగుల పొడవు, 18 అడుగుల వెడల్పుతో 16 అడుగుల ఎత్తుతో నమూనాను సిద్ధం చేశారు. బసవనగుడి ఎమ్మెల్యే రవి సుబ్రహ్మణ్య పాల్గొని ప్రారంభించనున్నారు. ఈనెల 30వరకు ప్రజల సందర్శనకు అవకాశం కల్పించనున్నారు. వాసవి దేవస్థానం 22 ఏళ్లు పూర్తి చేసుకుని 23వ వార్షికోత్సవానికి సిద్ధమవుతోంది. ఆలయంలో అమ్మవారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. మరోవైపు అయోధ్యలో జరిగే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం వీక్షించే సదుపాయం కల్పించనున్నారు.


అభివృద్ధి పనులకు కసరత్తు



- అధికార పార్టీ ఎమ్మెల్యేలకు భరోసా
- నియోజకవర్గానికి రూ.25 కోట్లు
- లోక్‌సభ ఎన్నికల వేళ నష్ట నివారణ చర్యలు
- ప్రతిపక్షాలకు సరికొత్త అస్త్రం చిక్కినట్టేనా..?



బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ సొంతపార్టీకి చెందిన ఎమ్మెల్యేల్లో అసంతృప్తిని తగ్గించడంతో పాటు ప్రభుత్వం ఆర్థికంగా దివాలా తీసిందనే ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సిద్ధమయ్యారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నారు. నెలసరి కోట్లాది మంది లబ్ధిదారులకు వివిధ రూపాల్లో గ్యారెంటీల నగదు బదిలీతో ఖజానాకు లోటు ఏర్పడుతూనే ఉంది. మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు వస్తున్న వేళ సొంతపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో తిరిగే పరిస్థితి లేకుండా పోయిందనే చిరాకును తగ్గించేందుకు గ్రాంట్ల గ్యారెంటీకి తెరలేపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరపున 135 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో 35 మంది మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన 100 మంది ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలకు రూ.25 కోట్ల చొప్పున గ్రాంట్లు ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నారు. ఫిబ్రవరి తర్వాత ఏక్షణంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చుని భావించిన ముఖ్యమంత్రి జనవరిలోగానే గ్రాంట్లు విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. డిసెంబరు నెలలో బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాల వేళ జరిగిన శాసనసభ్యుల సమావేశంలో సీఎం సిద్దరామయ్య గ్రాంట్ల విషయాన్ని ప్రస్తావించారు. అందుకు అనుగుణంగానే విడుదలకు కసరత్తు చేస్తున్నారు. 100 మంది గ్రాంట్లకు గాను రూ.2500 కోట్లు అవసరంగా ఉంటుంది. వాటిని ఎలా సమీకరించుకోవాలనే అంశంపై నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు సమాచారం.



లోక్‌సభ ఎన్నికల వేళ నష్ట నివారణ చర్యలు

లోక్‌సభ ఎన్నికల వేళ వివాదాల నివారణలకు ఎత్తుగడలు సాగుతున్నాయి. మంత్రి పదవులు దక్కని ముగ్గురు కీలక నేతలకు సీఎం సలహాదారులుగా నియమించుకున్నారు. ఆరునెలల వ్యవధిలోనే ప్రభుత్వాన్ని ముచ్చెమటలు పట్టించిన బీఆర్ పాటిల్, బసవరాజరాయరెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడేలా మార్చుకున్నారు. మరో వైపు 36 మంది ఎమ్మెల్యేలకు వివిధ బోర్డులు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టడానికి జాబితా కూడా సిద్ధమైంది. ఏ క్షణంలోనైనా వెలువడే అవకాశాలు ఉన్నాయి. మంత్రులుగా ఉండే 35 మందితో పాటు బోర్డులు, కార్పొరేషన్ల ద్వారా మరో 35 మందికి కొత్త బాధ్యతలు కట్టబెట్టారు. ఇలా 75 మందికి పైగానే అవకాశాలు దక్కినట్లయింది. మిగిలిన వారు ఎక్కడ కొత్త సమస్యలు తెరపైకి తెస్తారో అనే కారణంతో ఏకంగా మంత్రులు కాకుండా ఉండే వందమందికి గ్రాంట్లు కేటాయించదలచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిదినెలలు ముగుస్తున్నా ఎమ్మెల్యేలకు గ్రాంట్లు విడుదల చేయకపోవడంతో తీవ్రమైన కరువును ఎదుర్కొనే ప్రాంతాల్లో అత్యవసర పనులు కూడా చేపట్టలేకపోతున్నామని ఎమ్మెల్యేలు పలు సందర్భాలలో అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి తోడు మరో రెండు వారాల తర్వాత నిత్యం ప్రజల మధ్యనే ఎమ్మెల్యేలు ఉండాల్సి ఉంటుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని గ్రాం ట్ గ్యారెంటీకు తెరలేపారు.

ప్రతిపక్షాలకు సరికొత్త అస్త్రం చిక్కినట్టేనా..?

కేవలం అధికార పార్టీ ఎమ్మెల్యేలకు గ్రాంట్లు కేటాయించడం ద్వారా ప్రతిపక్ష పార్టీలకు కొత్త అస్త్రం చిక్కినట్లే అవుతుంది. నిత్యం కేంద్రప్రభుత్వంపై, ప్రధానమంత్రి నరేంద్రమోదీపై విమర్శలు చేసే సీఎం సిద్దరామయ్యను ప్రతిపక్షాలు కూడా అదే స్థాయిలో గ్రాంట్ల విషయమై నిలదీసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ప్రత్యేక గ్రాంట్లు కేటాయించడమనేది కొత్తకాదు. గతంలోనూ బీజేపీ కూడా తమ ఎమ్మెల్యేలకు ఎక్కువ గ్రాంట్లు కేటాయించింది. రాష్ట్రమంతటా కరువు నెలకొన్న సందర్భంతో పాటు లోక్‌సభ ఎన్నికల వేళ ప్రభుత్వ పక్షపాత వైఖరిని నిలదీసేందుకు బీజేపీ, జేడీఎస్ నేతలు, ఆ పార్టీల ఎమ్మెల్యేలకు ఒక మంచి అస్త్రం లభించినట్లు అవుతోంది.



శివకుమారస్వామిజీ చిత్రపటానికి సీఎం నివాళులు

శివకుమార స్వామీజీకి భారతరత్న ఇవ్వాలి

- కేంద్రానికి లేఖ రాస్తా : వర్ధంతి సభలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నడయాడే దేవుడిగా దశాబ్దాలపాటు విద్య, వసతి, ఆశ్రయం కల్పించిన సిద్ధగంగా మఠాధిపతి డాక్టర్ శివకుమారస్వామిజీకి 'భారతరత్న' ఇవ్వాలని, ఈమేరకు కేంద్రానికి లేఖ రాస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ఆదివారం సిద్దగంగా మఠంలో శివకుమారస్వామిజీ ఐదో వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ శివకుమారస్వామిజీకి భారతరత్న ఇవ్వాలనేది తమ డిమాండ్ అన్నారు. ఇందుకోసం కేంద్రానికి లేఖ రాస్తామని స్పష్టం చేశారు. 12వ శతాబ్దంలోనే కులమత రహిత సమాజంకోసం బసవణ్ణ పాటుపడ్డారన్నారు. ఆయన ఆశయాలతోనే శివకుమారస్వామిజీ సమాజానికి ఎంతో సేవచేశారని పేర్కొన్నారు. భారతరాజ్యాంగ ఆశయాలు బసవణ్ణ పోరాటం ఒక్కటే అన్నారు. మనకు రాజ్యాంగమే ధర్మగ్రంథమని, రాజ్యాంగం ప్రకారమే మనం వ్యవహరించాలని తెలిపారు. కష్టపడి పనిచేయడం, ఆకలి తీర్చుకోవడం జీవన విధానమని, రెండింటినీ శివకుమారస్వామిజీ జీవితకాలం పాటించారన్నారు. శివకుమారస్వామి అక్షర సంస్కృతి ద్వారా సమాజంలో మార్పు కోసం శ్రమించారని గుర్తు చేశారు. బసవణ్ణ ఆశయాలకు అనుగుణంగానే పేదలకు సంక్షేమాలు అమలు కావాలనే రాష్ట్రప్రభుత్వం ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తోందన్నారు. శివకుమారస్వామిజీ వర్ధంతిలో మాజీ సీఎం యడియూరప్ప, మంత్రులు పరమేశ్వర్, రాజణ్ణ, ఈశ్వర్‌ఖండ్రె, ఎంబీ పాటిల్, టీబీ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు. తోంటెదార్య సంస్థాన మఠాధిపతి డాక్టర్ తోంటద సిద్దరామ మహాస్వామిజీ, సిద్దగంగా మఠం ఉత్తరాధికారి శివసిద్దేశ్వరస్వామిజీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగాయి. వేలాది మంది విద్యార్థులు స్వామిజీని తలచుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు భాగస్వాములయ్యారు.



వేదికపై ప్రముఖులు

ఏపీలో ప్రజాస్వామ్య విలువలు నాశనం


- జగన్‌రెడ్డిని తరిమి కొట్టే రోజులు వచ్చేశాయ్
- వచ్చే ఎన్నికల్లో టీడీపీదే అధికారం
- చంద్రబాబుకు కర్ణాటక ప్రజల మద్దతు మరవలేనిది
- కమ్మ సంఘం సమావేశంలో పయ్యావుల కేశవ్

బళ్లారి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య విలువలు నాశనమయ్యాయని, ఆ రాష్ట్ర సీఎం జగన్‌రెడ్డిని ప్రజలు తరిమి కొట్టే రోజులు వచ్చేశాయని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆదివారం బళ్లారిలో కమ్మసంఘం నాయకుల ఆధ్వర్యంలో విందు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి బళ్లారి జిల్లా కమ్మ సంఘం అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్ అధ్యక్షత వహించారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని ఉద్దేశించి కేశవ్ మాట్లాడుతూ ఇక వైసీపీ పతనం ఖాయం అన్నారు. తెలుగు వాళ్లు ఎక్కడ ఉన్నా ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో స్వచ్ఛందగా గ్రామాలకు వచ్చి ఓటు వేసి టీడీపీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసినప్పుడు కర్ణాటక నుంచి భారీ ఎత్తున మద్దతు తెలిపారని, అది ఎన్నిటికీ మరవలేమని పేర్కొన్నారు. ఈసారి ఉరవకొండలో తాను గెలుస్తానని, టీడీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఉంటూ ధనం సంపాదించడమే లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు. తన తండ్రి ముఖ్యమంత్రిగా, తాను కేంద్ర మంత్రిగా పనిచేసినా ఏనాడూ అక్రమ సంపాదనకు పాల్పడలేదన్నారు. అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో శ్రమిస్తూ ఎంతో మంది తెలుగు రైతులు ఇక్కడికి వలస వచ్చి పంటలు పండిస్తూ దేశప్రజలకు ఆహారం అందిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వం చంద్రబాబుకు మద్దతు ఇచ్చే వాళ్లపై అక్రమ కేసులు పెట్టిన సమయంలో కర్ణాటకలో భారీ ఎత్తున మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఆంధ్రప్రదేశ్ కమ్మసంఘం అధ్యక్షుడు వెంకటరాయుడు, గద్దె అనురాధ, బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, కంప్లి ఎమ్మెల్యే గణేష్, కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్‌ప్రసాద్, కోనంకి రామప్ప, కమ్మ సంఘం నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, రాజేశ్, ముల్లంగి చంద్రశేఖర్, కాకర్ల తోట విజ్జీ, లాల్‌మోహన్, గుర్రం రమణ, మాజీ మేయర్ రాజేశ్వరి, కోనంకి తిలక్, విక్కీ, వివేక్, ముల్లంగి నందీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ← → కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డి





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.89	1,619.59
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	9,288
సామర్థ్యం (టీఎంసీలు)	10.13	60.19







హాజరైన కంప్లి ఎమ్మెల్యే గణేష్, కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్, బెస్ట్ స్కూల్ రామప్ప తదితరులు, పాల్గొన్న మహిళలు, ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

అపూర్వ కలయిక విజయవంతం

బళ్లారి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): నగరంలో కమ్మసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అపూర్వ కలయిక విజయవంతం అయ్యింది. 'కమ్మ వారి కమ్మని కలయిక- కమ్మని విందు'తో ఆదివారం చేపట్టిన కార్యక్రమంలో బళ్లారి, రాయచూరు, కొప్పళ, చిత్రదుర్గం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచే కాకుండా అనంతపురం, కర్నూలు, హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి సంఘం ప్రముఖులు, అభిమానులు విచ్చేశారు. శనివారం రాత్రే కొందరు బళ్లారికి చేరుకోగా మరి చుట్టుపక్కన ఉండే తాలూకాలు, జిల్లాల ప్రజలు ఆదివారం ఉదయం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ముఖ్యంగా మహిళలు, యువకులు, వృద్ధులు ఇలా అందరూ పసుపు కండవా దరించి తరలి రావడం ప్రత్యేక ఆకర్షిణీయంగా నిలిచింది. రోడ్డు పొడువుగా వారి వారి అభిమానులు ప్లెక్సీలు వేశారు. ఉదయం సభ ప్రారంభం ముందు వివిద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నందమూరి తారక రామారావు రాజకీయ ఏవీని ప్రదర్శించారు. అలాగే చంద్రబాబు నాయుడు అరెస్టు అయిన సమయంలో బళ్లారి, సిరుగుప్ప, సింధనూరు, గంగావతి, హొసపెటె, తదితర తాలూకాల్లో చేసిన దర్నాలు, నిరసనలు ఏవీ ద్వారా తిరిగి చూపించారు. కర్ణాటక నుంచి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా నుండి కమ్మసంఘం నాయకులు పాల్గొన్నారు. సుమారు 20 ఎకరాల స్థలంలో విశాల మైన వేదిక, ఇతర ఏర్పాటు చేసినా జనం ఊహించలేనంత రావడంతో ఆ ప్రాంతం అంతా కిటకిట లాడింది. పయ్యావుల కేశవ్ ప్రసంగం కోసం అధికశాతం జనం ఎదురు చూశారు. ఆయన ప్రసంగిస్తుండగా కేకలు, ఈలలు వేస్తూ ఉత్సాహంగా కనిపించారు. కమ్మసంఘం నాయకులు కుడితిని శ్రీనివాసులు, లాల్‌మోహన్, కుడితిని రాము, గుర్రం రమణ, కోనంకి తిలక్, గుర్రం రమణ, బుడుగు నాగేశ్వరరావు, బాలాజీ శ్రీనివాసులు, జయరాములు, కమ్మ పరిటాల చిన్నాయప్ప, సుధీర్ పాల్గొన్నారు.

మాకు రాజకీయ భిక్ష పెట్టింది ముండ్లూరు కుటుంబమే: నారా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'మా కుటుంబానికి రాజకీయ బిక్ష పెట్టింది కమ్మ సమాజంకు చెందిన ముండ్లూరు కుటుంబమే అని బళ్లారి ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కమ్మ సంఘం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సమావేశంలో మాట్లాడుతూ ముండ్లూరు రామప్ప మంత్రిగా ఉన్న సమయంలో మా నాన్న నారా సూర్యనారాయణరెడ్డికి సీఎం వద్దకు తీసుకెళ్లి మరీ బుడా అధ్యక్షుడిగా అవకాశం కల్పించారని, తన రాజకీయ ప్రవేశం వెనుక ముండ్లూరు ప్రోత్సాహం మరువలేనిదన్నారు. జిల్లాలో కులాల తేడా లేకుండా స్నేహబంధం సాగిస్తున్నామన్నారు.

రేపటి నుంచి కుంభమహోత్సవం

సిరుగుప్ప, జనవరి 21 : బూదిగుంప గ్రామంలో వెలసిన మారెమ్మదేవి, సుంకులమ్మ దేవి కుంభ మహోత్సవాలు ఈనెల 23, 24వ తేదీల్లో జరుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఐదేళ్లకొకసారి వేడుకలు ఘనంగా ఆచరించడం ఆనవాయితీ అని, 23న గంగ పూజలు, 24న కుంభ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ దేవతల ఆరాధనలతో పల్లెల్లో సంపూర్ణ ఆరోగ్యం, ప్రజా శ్రేయస్సు సాధ్యమన్నారు. లోక కల్యాణం కోసం చేస్తున్న పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ : డీసీ

బళ్లారి సిటీ,జనవరి 21: విద్యార్థుల్లో సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ విశేషంగా దోహదపడుతాయని జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, పాఠశాల విద్య, అక్షరాస్యతశాఖ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లాసంస్థ బళ్లారి ఆధ్వర్యంలో వాల్మీకి భవన్‌లో నిర్వహిస్తున్న స్కౌట్స్ మాస్టర్స్ అండ్ గైడ్ కెప్టెన్ల 7రోజుల జిల్లాస్థాయి ప్రాథమిక శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పాల్గొన్న విద్యార్థులు క్రమశిక్షణతో జాతీయ స్థాయికి ఎంపిక అవ్వాలన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ కర్ణాటక రాష్ట్ర ప్రిన్సిపల్ కమిషనర్ పీజీఆర్ సింధియా మాట్లాడుతూ.. సేవాభావంతో అహర్నిశలు కృషి చేస్తున్న స్కౌట్స్ అండ్ గౌడ్స్ సంస్థ మరో త్యాగశీలి అన్నారు. సేవా దృక్పథాన్ని పెంపొందించడమే ఉద్దేశమన్నారు. స్కౌట్స్ విభాగంలో 88 మంది ఉపాధ్యాయులు, గైడ్స్ విభాగంలో 126మంది ఉపాధ్యాయులు సహా మొత్తం 214మంది ఉపాధ్యాయులు శిబిరంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సెంటర్ వెల్ఫేర్ కర్ణాటక, రేంజరింగ్ డివిజన్ ఇన్‌చార్జి రాష్ట్ర అసిస్టెంట్ ఆర్గనైజేషన్ కమిషరర్ మల్లేశ్వరి, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ అధ్యక్షుడు వీరేశ్, ఉపాధ్యక్షుడు ఎంటీ మల్లేశప్ప, జిల్లాకోశాధికారి వి.ప్రభాకర్,జిల్లా శిక్షణ కమిషనర్లు జయశ్రీ జోషి, నాగరాజు, తాలూకా కార్యదర్శులు రోవర్స్,రేంజర్స్ కోచ్‌లు ఎస్.సోమప్ప,చంద్రయ్య హిరేమఠ్,నటరాజ స్వామి, జిల్లాఆర్గనైజర్ మెహబూబ్ భాషా, స్కౌట్స్ మాస్టర్స్ , గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.


లెనిన్‌కు ఘన నివాళి

బళ్లారి సిటీ, జనవరి 21: శ్రామికవర్గ మహానేత లెనిన్ 100వ వర్ధంతిని పురస్కరించుకుని ఏఐయూటీయూసీ బళ్లారి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు కార్మిక సంఘాల నాయకులు లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఏఐయూటీయూసీ జిల్లాధ్యక్షుడు కే.ఏ. దేవదాసు మాట్లాడుతూ ప్రపంచంలోనే తొలి కార్మిక రాజ్యంగా అవిర్భవించినది లెనిన్. 1917 నవంబర్ మహా విప్లవానికి లెనిన్ గొప్ప వాస్తుశిల్పి, ఆయన నేతృత్వంలోనే ఈగొప్ప విప్లవం జార్ చక్రవర్తి పాలనను అంతం చేయడమే కాకుండా , పెట్టుబడి దారీ వ్యవస్థను కూలదోశారన్నారు. ఏఐయూటీయూసీ కార్యదర్శి ప్రమోద్ మాట్లాడుతూ సోషలిస్టు రష్యాలో ఉపాధి ప్రాథమిక హక్కుగా ప్రకటించారన్నారు. విద్య, వైద్యం సహా అనేక సౌకర్యాలు ఉచితంగా అందించారు. వ్యభిచారాన్ని పూర్తిగా నిషేదించారు. స్త్రీలకు అన్నిరంగాలలో ఉచిత అవకాశం కల్పించడం ద్వారా సమానత్వం తీసుకువచ్చారు. ఇదంతా లెనిన్ హేతువాదం వల్లే సాధ్యమైందన్నారు.ఈసందర్భంలో జిల్లా ఉపాధ్యక్షులు శాంత తదితరులు పాల్గొన్నారు.



లెనిన్‌కు నివాళి అర్పిస్తున్న ఏఐయూటీయూసీ నాయకులు, సభ్యులు

నేడు జటాయువు ఆలయంలో ప్రత్యేకపూజలు



రాంపుర సమీపంలోని జటాయువు పర్వతం

బళ్లారి సిటీ, జనవరి 21: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట వేళ జటాయువు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జిల్లా సరిహద్దు నుంచి సుమారు 20కి.మీ. దూ రంలో చిత్రదుర్గ జిల్లాలోని రాంపుర గ్రామం సమీపంలోని శ్రీజరంగి రామేశ్వర ఆలయానికి చారిత్రక నేపథ్యం ఉంది. ఈ పర్వతానికి రామ, లక్ష్మణ, సీతతోపాటు రావణాసురుడు కూడా వచ్చినట్లు చరిత్ర చెబుతోంది. పురాణాల కథనం ప్రకారం సీతాపహరణం తర్వాత రామ,లక్ష్మణ, ఆంజనేయ అందరూ సీతను వెతుక్కుంటూ రాగా రామ,లక్ష్మణులు విచారించగా సీతను లంకాధీశుడైన రావణుడు అపహరించుకుని వెళ్ళినట్లు తెలియజేసి ప్రాణాలు కోల్పోతుంది. ఈ స్థలంలోనే శ్రీరాముడు స్వయంగా ప్రతిష్టిస్తాడు. అంతేకాక జటాయువు చివరి శ్వాస వదిలిన స్థలంలో సమాధి నిర్మించారని రామాయణం ద్వారా తెలుస్తోంది. సముద్ర మట్టం నుంచి 3,469 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండను జటాయువు ప ర్వతం అని పిలుస్తారు. ఈసమాధి కింద గుహాకారంలో జరంగి రామేశ్వర ఆలయం ఉంది. ప్రస్తుతం అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠోత్సవం జరుగుతున్న శుభవేళ భక్తులు ఈ జరంగి రామేశ్వర కొండకు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. భారీగా తరలిరానున్న భక్తుల కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేపట్టారు.

జరంగి రామేశ్వర ఆలయం



లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే

కంప్లి, జనవరి 21 : కురుగోడు, కంప్లి పట్టణాల లోని ప్రధాన వీధుల్లో హైమాస్ లైట్లను ఎమ్మెల్యే గణేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతో కాలంగా ప్రధాన రోడ్డులోన విద్యుత్ లైట్లు లేక ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రజలను దృష్టిలో వుంచుకుని సదుపాయాలు కల్పించామన్నారు. కురుగోడు పట్టణాన్ని అభివృద్ధి చేపట్టి మా దిరి పట్టణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.



స్విచాన్ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



మహిళలకు చికిత్స అందిస్తున్న డాక్టర్ సుమీల

కంప్లి, జనవరి 21 : మహిళలు, బాలింతలు పౌష్టికాహారం వలనే అనారోగ్యం నుంచి విముక్తి అవుతారని ఏళుబెంచి సీహెచ్‌వో డాక్టర్ సుమీళ తెలిపారు. ఏళుబెంచి ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ఆరోగ్య మెళకువలను అందిస్తూ అవగాహన కల్పించారు. గర్భిణీ మహిళలు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. గర్భిణీ మహిళలకు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఆ పరీక్షల్లో బలహీనంగా వున్న మహిళలకు చికిత్సలు కల్పించారు. ఈ కార్యక్రమంలో చలవాది హనుమంతప్ప, మారెన్న, గాయత్రి, అనసూయ, సరస్వతి, వనజాక్షి, మానస, తమ్మనగౌడ, తదితరులు పాల్గొన్నారు.

శివకుమార స్వామి సేవలు అమోఘం

కంప్లి, జనవరి 21 : కలియుగ ఆరాధ్యదైవంగా పిలువబడే శివకుమార స్వామి సేవలు మరువలేనివని ఏళుబెంచి అమరేశ్వరశాస్త్రి తెలిపారు. ఆయన పుణ్యస్మరణ సందర్భంగా ఏళుబెంచి గ్రామంలో ఆయన భావ చిత్రపటానికి పూలమాలలతో పూజలు నిర్వహించారు. వారు కలియుగ ఆదర్శ మహానుభావుడిగా గుర్తింపు పొందారన్నారు. శివకుమార్ వర్ధంతి సందర్భంగా ఏళుబెంచి గ్రామంలో బసవన్న ఆలయం వద్ద అన్నప్రసాదాలు కల్పించారు. శ్రీమఠ పూర్వవిద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివకుమార్‌స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



శివకుమార స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా అంబిగర చౌడయ్య జయంతి



ఊరేగింపులో పాల్గొన్న సమాజం ప్రముఖులు, ప్రజాప్రతినిధులు,అధికారులు

రాయచూరు జనవరి 21: నిజ శరణుడిగా ఖ్యాతిగాంచిన అంబిగర చౌడయ్య జయంతిని నగరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధికారికంగా నిర్వహించిన జయంతి కార్యక్రమంలో సమాజం ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని స్థానిక బీఆర్‌బీ సర్కిల్ వద్దగల చౌడయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ, కన్నడ మరియు సాంస్కృతాక శాఖ,జిల్లా గంగామతస్థ సమాజం సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ప్రముఖులు, అధికారులు తదితర ప్రముఖులు పూలమాలలు వేసి అనంతరం చౌడయ్య చిత్రపటాన్ని నగర ప్రధాన రహదారుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో చిన్ననీటి పారుదల, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసరాజు, ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్, సిటీ ఎమ్మెల్యే డా.శివరాజ్ పాటీల్, జిల్లా ఎస్పీ బి.నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కంప్లి : గంగామత సమాజం వారు అంబిగరచౌడయ్యను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్‌గణేష్ తెలిపారు. కురుగోడు పట్టణంలోని తమ కార్యాలయంలో అంబిగర చౌడయ్య జయంతిని నిర్వహించారు. వారితో పాటు ఓంకారప్ప, మల్లికార్జున, చలుమేష్, గిరి, సతీష్, బట్టప్రసాద్, సమాజం తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

అటవీ నేరాల నియంత్రణకు హెల్ప్‌లైన్

హోసూరు, జనవరి 21: హోసూరు రిజర్వు ప్రాంతంలో ఏనుగుల సంచారానికి సంబంధించడంతోపాటు అటవీ నేరాలను అరికట్టేందుకు టోల్ ఫ్రీ నంబర్ 8004255135 ప్రకటించారు. కృష్ణగిరి జిల్లా మొత్తం 5143 చదరపు కిల్లో మీటర్లు ఉండగా, హోసూరు అటవీ ప్రాంతం 1492 చదరపు కిల్లో మీటర్లు (29 శాతం) వైశాల్యంతో జిల్లా అంతటా విస్తరించింది. ఇక్కడ ఉన్న పెద్ద ముఖ్యమైన అటవీ జాతుల రక్షణను పరిగణనలోకి తీసుకుని కావేరీ ఉత్తర వన్యప్రాణుల అభయారణ్యం 2014లో ప్రకటించబడింది. కావేరీ దక్షిణ వన్యప్రాణుల అభయారణ్యం 2022లో తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. పెద్ద సంఖ్యల్లో టేకు, గంధం, జాలరి, వివిధ జాతుల చెట్లు పెద్ద సంఖ్యల్లో ఉన్నాయి. ఎలుగుబంట్లు, చిరుతలు, నెమళ్లు, లేళ్లు, అలాగే బూడిద ఉడుతలు వంటి అరుదైన జంతువులు, కనిపిస్తాయి. ప్రతి సంవత్సరం అక్టోబర్ నెలలో దాదాపు 125 నుంచి 150 ఏనుగులు తళి, జవలగిరి, రిజర్వ్ ఫారెస్ట్‌లోకి ప్రవేశించి డెంకణీకోట, నొగనూరు, ఊడేదుర్గం, శానమావు, చెట్టిపల్లి, మహారాజగడ రిజర్వు మీదుగా ఆంధ్ర ప్రదేశ్‌లోని గౌండన్య అభయారణ్యం, వెంకటేశ్వర అభయారణ్యం వరకు తిరుగుతూ ఏప్రిల్, మే నెలల్లో వాపసు వస్తాయి. కాగా తరచూ చెట్ల నరికివేత, వన్యప్రాణుల వేట జరుగుతుండడంతో అటవీ శాఖ అధికారులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. వన్యప్రాణులకు ఎవరైనా హాని కలిగిస్తే, అటవీ ఆక్రమణలకు పాల్పడితే టోల్ ఫ్రీ కాల్ సంప్రదించి సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.

ముగిసిన ఐఎన్‌టీయూసీ జిల్లాస్థాయి సదస్సు

హోసూరు, జనవరి 21: హోసూరు నగరం తళి రోడ్డులో ఐఎన్‌టీయూసీ జిల్లా 12వ సదస్సు ఆదివారం జరిగింది. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కేఏ మనోహరన్ నేతృత్వం వహించారు. ఐఎన్‌యూటీసీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్నాథన్ సదస్సును ప్రారంభించి మాట్లాడుతూ బాగలూరులోని ఏషియన్ బేరింగ్ ఫ్యాక్టరీ మూతపడి 18ఏళ్లుగా ఉపాధి కోల్పోయిన కార్మికులకు వెంటనే వేతన బకాయిలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హోసూరులో భారీ బంద్ చేపడతామన్నారు. ప్రత్యేక అతిథులుగా అఖిల భారత ఐఎన్‌టియూసీ కార్యదర్శి సంజయ్‌కుమార్ సింగ్, కర్ణాటక ఐఎన్‌టియూసీ అధ్యక్షుడు లక్ష్మి వెంకటేశన్‌లు పాల్గొన్నారు. జగన్నాథన్ మాట్లాడుతూ 2014 కుముందు 90 శాతం మంది కార్మికులు పర్మినెంట్ ఉద్యోగులుగా 10 శాతం మంది కాంట్రాక్ట్ కార్మికులుగా ఉండేవారన్నారు. 2014 తర్వాత 10 శాతం కార్మికులు మాత్రమే శాశ్వత ఉద్యోగులు, 90 శాతం కార్మికులు కాంట్రాక్ట్ కార్మికుల నియామకంగా మార్చారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం లభించి ఏడు దశాబ్దాలు దాటినా కార్మికులకు మాత్రం ఇంకా స్వాతంత్ర్యం రాలేదన్నారు. కేంద్రంలో ప్రభుత్వం మారాలంటే కార్మికులు ఏకం కావాలన్నారు. సదస్సుల్లో 23 తీర్మానాలను ఆమోదించారు, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే ఉప సంహరించుకోవాలని,



సదస్సులో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహరన్

హోసూరు ఈఎస్‌ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు పెంచాలని, ఈఎస్‌ఐ హాస్పిటల్ ఫార్మసీలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. చెన్నై తరహాలో హోసూరులో మహిళల కోసం మహిళల హాస్టల్ ఏర్పాటు చేయాలని, తమిళనాడు హౌసింగ్ బోర్డు కార్మికులకు తక్కువ ధరకే ఇళ్లు నిర్మించాలని, హోసూరు నుంచి సేలం మీదుగా చెన్నైకి రోజువారీ రైలు నడపాలని ప్రతిపాదించారు. బెంగళూరు-హోసూరు-మెట్రో రైలు పనులు ప్రారంభించేందుకు కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని తదితర తీర్మానాలు చేశారు. సదస్సులో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సుందరరాజన్, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి రాజేంద్రన్, జీ మునిరాజు, రాష్ట్ర కార్యదర్శి సౌర్నరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కళంజియం శుభకాంక్షలు తెలిపారు. జిల్లా కార్యదర్శి పరమానంద ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

ఏనుగుల సంచారంతో బెంబేలు

హోసూరు (మత్తిగిరి) జనవరి 21: కృష్ణగిరి జిల్లా హోసూరు శానమావు, పోడూరు, పేరండపల్లి అటవీ ప్రాంతాలలో వారం రోజులుగా సుమారు 15 ఏనుగులు విడివిడిగా సంచరిస్తూ పంటలను నాశనం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. అడవులకు అనుబంధంగా ఉన్న రామాపురం, తిరుచ్చి పల్లి అళియాళం, డి కొత్తూరు సానమావు గ్రామాల్లో ఏనుగుల మంద పంటలను దెబ్బతీస్తోంది. ఏనుగులను వెంటనే దట్టమైన అడవుల్లోకి తరిమికొట్టాలని రైతులు కోరుతున్నారు. ఆదివారం ఉదయం హోసూరు శానమావు అడవుల్లో విడివిడిగా సంచరించిన ఏనుగులు అడవి నుంచి బయటకు వచ్చి సమీపంలోని కొమ్మేపల్లి ప్రాంతంల్లో సంచరిస్తుండడంపై అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన అధికారులు రంగంలోకి దిగి ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరిమే కార్యాచరణ చేపట్టారు. ఏనుగుల సంచారం నేపథ్యంలో రాత్రివేళలల్లో పంటలకు కాపాలగా వెళ్లరాదని, అలాగే పగలు పశువులను మేపేందుకు సైతం వెళ్లరాదని అధికారులు సూచించారు. కాగా అటవీప్రాంతాలలో రాత్రి పూట సంచరించే వేళల్లో వాహనదారులు సైతం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఏనుగుల గుంపు

ఘనంగా వారాహి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

హోసూరు (సిప్‌కాట్) జనవరి 21: కృష్ణగిరి జిల్లా కటిగానపల్లి గ్రామం శూలగిరి సమీపంలో వారాహి అమ్మవారి ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. కుంభాభిషేకం అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం వేకువజామునుంచే విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, గంగాపూజ, గోపూజ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. భవాని నది తీరం నుం చి తీసుకొచ్చిన పవిత్ర తీర్థాన్ని 48 రోజుల పాటు ఉంచారు. అమ్మవారి విగ్రహాన్ని 22 రోజుల పాటు జలాధివాసం, అనంతరం ధాన్యాదివాసం చేశారు. ఉత్సవంలో అశోక్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ జ యప్రకాశ్, అన్నాడీఎంకే నాయకుడు మధు హేమనాథ్, ఆల య వ్యవస్థాపకుడు డీపీ హెచ్ ఎం మోహన్, రాజేశ్, శివకుమార్, వెంకటేశ్, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





కుంభాభిషేకంలో అర్చకులు, వారాహి అమ్మవారు

నిజశరణ సిద్ధాంతాలు ఆచరణీయం..



ఊరేగింపులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, బీజేపీ నాయకులు

సిరుగుప్ప, జనవరి 21 : నిజశరణ అంబిగర చౌడయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప మాట్లాడుతూ.. ఆయన సిద్ధాంతాలు నిత్యం ఆచరణీయమైనవన్నారు. అభిమానులు ఆయన భావ చిత్రపటానికి నివాళులర్పించారు. పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు సంస్కారం తప్పనిసరి'




తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

బళ్లారి సిటీ,జనవరి 21: విద్యార్థులకు చదువుతోపాటు వ్యక్తిత్వం,క్రమశిక్షణ సంస్కారం చాలా ముఖ్యమని విశ్రాంత ఉపాధ్యాయుడు గాళయ్య పేర్కొన్నారు. నగరంలోని విద్యానగర్ నంద వసతి పాఠాశాలలో శనివారం ఏర్పాటు చేసిన గోమాత, తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమంలో న్యాయవాది కోటేశ్వరావు, నందపాఠశాల ఛైర్మన్ వేములపల్లి గాంధీ, గాలయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని అప్పుడే విద్యార్థులు పైస్థాయిలోకి ఎదుగుతారన్నారు. మురళీకృష్ణ, పార్వతి, లక్ష్మీకాంత్, వినయ్‌కుమార్ చౌదరి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

కాళేశ్వరరావు (జయంతి)




అయ్యదేవర కాళేశ్వరరావు కృష్ణా జిల్లా నందిగామలో 1881 జనవరి 22న జన్మించారు. మహాత్మాగాంధీ నాయకత్వంలోని అన్ని ఉద్యమాల్లోనూ వీరు చురుకైన పాత్రను పోషించారు. పలుమార్లు కారాగార శిక్షను అనుభవించారు. విజయవాడ పురపాలక సంఘం అధ్యక్షుడిగా సేవలందించారు. మద్యపాన నిషేధ చట్టం, సేల్స్‌టాక్సు, హరిజన దేవాలయ ప్రవేశం తదితర చట్టాల రూపకల్పనలో క్రియాశీలక పాత్రను పోషించి అందరి ప్రశంసలు పొందారు. స్వాతంత్ర్యానంతరం విజయవాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి శాసనసభకు ఎన్నికయ్యారు. శాసనసభ తొలి స్పీకర్‌గా పనిచేశారు. 1962 ఫిబ్రవరి 26న విజయవాడలో కన్నుమూశారు.

మాడపాటి హనుమంతరావు (జయంతి)



'పద్మభూషణ' గ్రహీత మాడపాటి హనుమంతరావు 1885 జనవరి 22న కృష్ణా జిల్లా నందిగామ తాలూకా పొక్కునూరులో జన్మించారు. ఆంధ్రా పితామహగా ఖ్యాతి పొందిన మాడపాటి ఎన్నో చిన్నకథలు బహుళ ప్రజాదరణ పొందాయి. నిజాం హయాంలో తెలుగు భాషాభివృద్ధికి అపార సేవలందించారు. హైదరాబాద్ తొలి మేయర్‌గా పని చేశారు. ఆంధ్రమహాసభ సంస్థాపకుల్లో ఆయన ఒకరు. 1970 నవంబరు 11న కన్నుమూశారు.

కొండపల్లి శేషగిరిరావు (జయంతి)



ప్రముఖ చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు 1924 జనవరి 22న వరంగల్ జిల్లా పెనుగొండ గ్రామంలో జన్మించారు. భారతీయ సంప్రదాయ చిత్రలేఖనంలో అద్భుతాలు సృష్టించారు. ఆక్వా టెక్చర్ పెయింటింగులకు ఆయనను మార్గదర్శకుడిగా చెబుతారు. వీరి చిత్రాలలో శకుంతల, దమయంతి, రామాయణం వంటి పురాణాలకు సంబంధించిన కళాఖండాలు ప్రశంసలు అందుకున్నాయి. తొలి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వీరు 'తెలుగు తల్లి'ని సాక్షాత్కరింపజేశారు. తెలంగాణ కాకి పడగలు, రామప్ప దేవాలయం విశిష్టతను వివరించిన తొలి చిత్రకారుడు కూడా ఆయనే కావడం విశేషం. డాక్టరేట్‌లతో పాటు హంస అవార్డులను అందుకున్నారు. వీరి చిత్రాలు దేశ పార్లమెంటు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉంచారు. 2012 జూలై 26న కన్నుమూశారు.

అక్కినేని నాగేశ్వరరావు (వర్ధంతి)



'పద్మ విభూషణ్' గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు (ఏఎన్నాఆర్) కృష్ణా జిల్లా నందివాడ మండలం రామాపురంలో 1924 సెప్టెంబరు 20న జన్మించారు. తెలుగు సినిమా తొలినాళ్ళ అగ్ర నాయకుల్లో అక్కినేని ఒకరు. నాటకాలలో స్త్రీ పాత్రల ద్వారా ప్రేక్షకుల ఆదరణ చూరగొన్నారు. తెలుగు, తమిళ సినిమాల్లో దాదాపు 75 సంవత్సరాల పాటు నటించారు. మరో అగ్రనటుడు ఎన్‌టీఆర్‌తో పాటు తెలుగు సినిమాకు మూల స్తంభంగా గుర్తింపు పొందారు. సమాజసేవలో సదా ముందుండే వారు. ప్రతిష్ఠాత్మక 'దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం', పద్మశ్రీ, పద్మభూషణ్, ఎన్టీఆర్ జాతీయ పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు. 91వ ఏట 2014 జనవరి 22న కన్నుమూశారు.

టీఎం కృష్ణ (పుట్టినరోజు)



కర్ణాటక సంగీత గాయకుడు, రచయిత తోడూరు మాడభూషి కృష్ణ చెన్నైలో 1976 జనవరి 22న జన్మించారు. మద్రాస్ మ్యూజిక్ అకాడమీకి ఆయన సంస్థాపక సభ్యుడు. సంగీత సంప్రదాయ ప్రదర్శినికి సంబంధించి దీక్షితార్ బాణీలకు ఆయన స్వరకల్పన చేశారు. కర్ణాటక సంగీతానికి సంబంధించి పలు పుస్తకాలను కూడా రాశారు. ప్రతిష్ఠాత్మక రామన్ మెగసెసె అవార్డు, ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం ఇతర గౌరవాలు అందుకున్నారు.

రామమందిర ఆహ్వానాలు పంపేందుకు వీరెవరు..?

▸▸ కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ ఆగ్రహం

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిర ప్రారంభానికి ఆహ్వానాలు పంపేందుకు వీరెవరని పరోక్షంగా బీజేపీ వారిని ఉద్దేశించి కాంగ్రెస్ నేత బీకే హరిప్రసాద్ మరో వివాదాస్పద వ్యాఖ్యను చేశారు. చిక్కమగళూరులో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఏ దేవుడి కార్యక్రమానికైనా ఆహ్వానం వద్దన్నారు, అక్కడ జగద్గురు లేరని, ఉన్నది విశ్వగురు అని అది బీజేపీ విశ్వగురు నిర్వహిస్తున్న రాజకీయ కార్యక్రమమన్నారు. శంకరా చార్యులు హిందూమతం ముఖ్యులని, శంకరా చార్య పరంపర పీఠాధిపతులు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం చేసి ఉంటే ధార్మిక కార్యక్రమం అయ్యేదన్నారు. శంకరాచార్య స్వామిజీలు వెళ్లడం లేదన్నారు.

విశ్వగురు జగద్గురు కాదన్నారు. విశ్వగురు ఏం అనేది దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. శంకరాచార్యులు ప్రాణప్రతిష్ఠం చేసి ఉంటే మాకు అవసరం ఉండేది కాదన్నారు. దేశంలో 33 కోట్ల దేవతలు ఉన్నారన్నారు. దేవుడి చెంతకు వెళ్లాలని, ఇటువంటి దేవుడి వద్దకే వెళ్లాలా..? అని ప్రశ్నించారు. మేం భూతాలు, దెయ్యాలకు పూజలు చేసేవారమా అని ఎదురు ప్రశ్న వేశారు. కాగా నేను అధికారం కోసం వలస ప్రాణి కాదన్నారు. వేర్వేరు పార్టీలనుంచి వచ్చిన కొందరు కాంగ్రెస్ పార్టీనే మాదని అంటున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. బోర్డులు, కార్పొరేషన్‌ల నియామకాల విషయమై మీడియా ప్రశ్నకు సమాధానంగా నేను ప్రభుత్వంలో లేనని, ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారో తెలియదన్నారు. నేనెందుకు కాంగ్రెస్‌కు వ్యతిరేకం అవుతానని, విద్యార్థి దశనుంచి అక్కడే ఉన్నానన్నారు. అయితే ముఖ్యమంత్రికి తనపై ఎటువంటి కోపం లేదన్నారు. మొత్తమ్మీద బీకే హరిప్రసాద్ వ్యాఖ్యలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. ఆయన తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు.


ఉత్తర కన్నడ జిల్లా ద్వీపాలకు ఆదరణ

▸▸ మాల్దీవులపై వ్యతిరేకత ప్రభావం...

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుదూరంగా ఉండే సముద్రతీరంలో ఉత్తరకన్నడ జిల్లా వ్యాప్తంగా పలు ద్వీపాలు ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మాల్దీవులకు చెందిన రాజకీయ నేతలు విమర్శలు చేసిన తరుణంలో పర్యాటకులు అక్కడికి వెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. పైగా దేశంలోని సముద్ర తీరాలలో అందమైన ప్రాంతాలు ఉన్నాయని వాటిని సందర్శించాలనే డిమాండ్ సర్వత్రా పెరుగుతోంది. రాష్ట్రంలో ఉత్తర కన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల పరిధిలో అరేబియా సముద్రం ఉంది. ఉత్తరకన్నడ జిల్లా రాష్ట్రానికే ప్రత్యేకమైనదిగా చెప్పుకోవచ్చు. ఇక్కడ నదులు, దట్టమైన పశ్చిమ కనుమలు, జలపాతాలతోపాటు సముద్రప్రాంతంలో పలు చోట్ల ద్వీపాలు ఉన్నాయి. బ్రిటీష్‌కాలంలో ఇక్కడి ద్వీపాలలో అధికారులు, సైనికులు గడిపేవారు. అందుకోసం ప్రత్యేక నిర్మాణాలు ఇప్పటికీ ఉన్నాయి. అయితే స్వాతంత్ర్యం వచ్చాక వీటి పట్ల ఆదరణ తగ్గింది. ఉత్తరకన్నడ జిల్లా పరిధిలోని మురుడేశ్వర సముద్రంలో నిర్మించినదే. మురుడేశ్వర్ సమీపంలోనే నేత్రాని ద్వీపం ఉంది. పర్యాటకులు ఈ ద్వీపం చుట్టూ సందర్శించి స్కూబా డ్రైవింగ్‌కు వెళ్తారు. భట్కళ్ పరిధిలోని కిరికుంద, హొన్నావర పరిధిలోని బసవ రాయదుర్గతోపాటు కార్వార నరసింహఘడ ద్వీపాలు ఉన్నాయి. అప్పుడప్పుడు ప్రజలు ద్వీపాలను సందర్శిస్తుంటారు. నరసింహఘడ ద్వీపంలో ఏటా నరసింహ స్వామి జాతర జరుగుతుంది. అప్పుడు వేలాది మంది బోట్ల ద్వారా సముద్రమార్గం గుండా ద్వీపానికి వెళ్లి దేవుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. అంజు ద్వీపం నావికాదళం స్వాధీనం చేసుకుంది. ఇక్కడ నావికా దళ బృందాలు మినహా ఇతరులకు ప్రవేశం లేదు. సన్యాసి గుంజ, మినిస్ట్రీ ఆఫ్ షిప్పింగ్‌కు చేరిన లైట్‌హౌస్‌తోపాటు పదులసంఖ్యలో ఐల్యాండ్‌లు కార్వారలో ఉన్నాయి. ఇక్కడికి వెళ్లాలంటే జిల్లా అధికారి అనుమతి తప్పనిసరిగా తీసు కోవాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఎవరూ అటువైపు వెళ్లేం దుకు వీలులేదు. ఈ ఐల్యాండ్‌లు కేంద్రప్రభుత్వ అధీనంలో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం పర్యాటక రంగాన్ని అభివృద్ధి చే యదలిచి కేంద్రం నుంచి అనుమతులు పొంది ద్వీపాలను అభివృద్ధి చేస్తే విహార విడిదిలుగా మారనున్నాయి.



కార్వార లైట్ హౌస్ ప్రదేశం



కార్వార ఐల్యాండ్

లైట్ హౌస్ ద్వీపం

కార్వార నగరం నుంచి సముద్రమార్గంగా సుమారు 15 కిలోమీటర్ల దూరంలో మినిస్ట్రీ ఆఫ్ షిప్పింగ్‌కు చెందిన లైట్ హౌస్ ద్వీపం ముగ్ధమనోహరంగా ఉంది. సముద్ర మార్గంలో వెళ్లే బోట్లకు మార్గదర్శకం చేసేందుకు బ్రిటీష్ కాలంలో ఇక్కడ లైట్‌హౌస్‌ను నిర్మించారు. బ్రిటీష్‌కాలంనాటి ఫిరంగులను కూడా చూడవచ్చు. లైట్‌హౌస్ మాత్రమే కాకుండా తదడి, హొన్నావర, భట్కళకు అనుబంధమైన లైట్‌హౌస్‌లు కూడా బ్రిటీష్‌వారు నిర్మించినవే. ముంబైలో ఉగ్రవాదుల దాడుల తర్వాత ఈ లైట్‌హౌస్‌లను నిఘా కోసం మరింత అభివృద్ధి చేశారు. విదేశీ ద్వీపాలకు ఏ మాత్రం తీసిపోకుండా ప్రకృతి సౌందర్యాన్ని ఇక్కడ తిల కించవచ్చు. వివిధ సముద్ర జీవులను చూడవచ్చు. అయితే ద్వీపాల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ద్వీపాలలో సంచ రించేందుకు సరైన రోడ్డు మార్గాలు లేక అక్కడి సిబ్బంది కి వసతి సౌలభ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంది. బూత్‌బంగళాల తరహాలో ఉండే పురాతనమైన గదులలోనే సిబ్బంది బస చేయాల్సి ఉంది. నెలల తరబడి అక్కడే సిబ్బంది గడుపుతుంటారు. ద్వీపాలను అత్యుత్తమ పర్యాటక కేంద్రంగా తీర్చేందుకు వీలుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా వాటిని అభివృద్ధి చేస్తే ద్వీపాలలో గడిపేందుకు ఆసక్తి చూపే పర్యాటకుల సంఖ్య పెరగనుంది.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు కోలారు స్వచ్ఛతా రాయబారులు

▸▸ చెత్త వాహన మహిళా డ్రైవర్లకు ఆహ్వానం

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): కోలారు తాలూకా బెగ్లి హొసహళ్ళి గ్రామపంచాయతీ స్వచ్ఛ వాహిని (చెత్త సేకరించే వాహన) మహిళా డ్రైవర్‌లకు ఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఆహ్వానం అందింది. వాహన డ్రైవర్ మంజుళ, సహాయకురాలు శశికళలకు ప్రత్యేక ఆహ్వానం పంపారు. ఈమేరకు ఆదివారం శశికళ మీడియాతో మాట్లాడుతూ 25న ఢిల్లీ వెళ్తామని, గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నాక ప్రధానమంత్రి, రాష్ట్రపతితో కలసి తేనీటి విందులో భాగస్వామ్యులవుతామన్నారు. కుటుంబానికే పరిమితమై గృహిణిగా కొనసాగుతున్న నన్ను పంచాయతీ అధికారులు, సభ్యులు డ్రైవర్‌ను చేశారని ఏకంగా ఢిల్లీ వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు. పంచాయతీ సర్పంచ్ దీపికా లోకేశ్, పీడీఓ మధుమతి, సభ్యుల సహకారం మరువలేనన్నారు. మంజుళ మాట్లాడుతూ రెండు న్నరేళ్లుగా డ్రైవర్‌గా ఉన్నానని, భర్త లోకేశ్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారన్నారు. స్వచ్ఛభారత్ పథకంలో భాగంగా స్వచ్ఛ వాహిని కార్యక్రమాన్ని అమలు చేసేందుకు పంచాయతీ సాధారణసభలో తీర్మానించి కొత్త వాహనం కొనుగోలు చేశాక డ్రైవర్‌గా ఉద్యోగం దక్కిందన్నారు. ఇంటింటా చెత్త సేకరించే పని ద్వారా అత్యున్నత అవకాశం దక్కిందన్నారు. వీరి ఎంపికపై గ్రామస్థులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎంపికైన మహిళలు వీరే...

సంక్రాంతి సంబరాలు మన సంస్కృతి



ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాలరెడ్డితో బీటీఎఫ్ ముఖ్యులు

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలు అనాదిగా వస్తున్న మన సంస్కృతి అని టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాలరెడ్డి అభిప్రాయపడ్డారు. బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం సర్జాపుర రోడ్డులోని ఆస్థా మైదానంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం దాకా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. భోగి మంటలతో ఆరంభించి సంక్రాంతి రంగవల్లుల సందడి చేశారు. అనంతరం గంగిరెద్దులకు పూజలతోపాటు వివిధ సంప్రదాయ క్రీడలు, కార్యక్రమాలు జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఏడాది పాటు రైతు కష్టపడి పనిచేసి వచ్చిన పంట దిగుబడులతో వంటకాలు చేసుకుని ఆరగించడమే సంక్రాంతి ఉద్దేశ్యమన్నారు. రైతుతోపాటు కష్టించే కాడెద్దులకు పూజలు చేస్తారన్నారు. హరిదాసుల కీర్తనలు, గొబ్బెమ్మలు ముఖ్యమన్నారు. తెలుగువారు విద్య, ఉద్యోగ, వ్యాపారాలకోసం బెంగళూరులో స్థిరపడినా సంక్రాంతి పేరిట ఒక్కటి కావడం సంతోషమన్నారు. అంతకుమించి బెంగళూరులో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు బాగుండాలని టీడీపీ ఫోరం సంస్థను ఏర్పాటు చేసుకుని దశాబ్దానికిపైగా ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతి, తెలుగుదేశం పార్టీ కోసం నిరంతరంగా పనిచేస్తున్న మీ శ్రమకు అభినందనలన్నారు. సంక్రాంతి రుచులతోపాటు మధ్యాహ్నం తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. టీడీపీ కన్వీనర్ రావి మోహన్‌చౌదరి బహుమతులు ప్రదానం చేశారు. టీడీపీ ఫోరం ముఖ్యులు కనకమేడల వీర, సోంపల్లి శ్రీకాంత్, శివ చినమోలు, వంశీ మన్నం, పవన్ మోటుపల్లి, కోకా కేశవ్, విజయ్ రాంభూపాల్, విష్ణు, ఫణి, నారాయణ పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న చిన్నారులు

ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ, జేడీఎస్ నేతల చర్చలు

▸▸ యడియూరప్ప నివాసంలో కీలకుల భేటీ



యడియూరప్ప నేతృత్వంలో ప్రముఖుల చర్చలు

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, జేడీఎస్ పార్టీల మధ్య పొత్తు కుదిరిన తర్వాత తొలిసారి ఇరుపార్టీల కీలకనేతలు సమావేశమయ్యారు. ఆదివారం డాలర్స్ కాలనీలోని మాజీ సీఎం యడియూరప్ప నివాసంలో భేటీ అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై వ్యవహరించాల్సిన వ్యూహాలపై ఇరుపార్టీల ముఖ్యులు చర్చించారు. మాజీ సీఎంలు యడి యూరప్ప, బసవరాజ్ బొమ్మై, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత ఆర్ అశోక్, సదానందగౌడ, జేడీఎస్ నేతలు కుమారస్వామి, నిఖిల్ కుమార్, బండెప్ప కాశంపూర్, జీటీ దేవేగౌడలు పాల్గొన్నారు. ఉప ఎన్నికల్లో మైత్రి అభ్యర్థిని రంగంలోకి దించే విషయమై చర్చించారు. సభ ముగిశాక యడియూరప్ప మీడియాతో మాట్లాడుతూ విధానపరిషత్ ఎన్నికలకు సంబంధించి మాత్రమే చర్చలు జరిపామన్నారు. ఇక్కడి తీర్మానాలను ఢిల్లీ నేత లకు పంపుతామన్నారు. మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై మాట్లాడుతూ పొత్తు కుదిరిన మేరకు సమష్టిగా పనిచేయాలని తీర్మానించామని, ఆ దిశగానే చర్చలు సాగాయన్నారు. కుమార స్వామి మాట్లాడుతూ ఇరుపార్టీల ముఖ్యులు పాల్గొన్నామన్నారు. రాష్ట్రంలో మైత్రి ఏర్పడ్డాక ఇదే తొలిసభ అన్నారు. విధానపరిషత్ ఉప ఎన్నికల అంశమై చర్చించామన్నారు. రానున్న ఎన్నికలకు ఇక్కడనుంచే సందేశాన్ని ఇవ్వదలిచామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరింతశక్తినిచ్చేలా ఎక్కువస్థానాల్లో గెలుపు సాధించడమే మా లక్ష్యమన్నారు. మాజీ డీసీఎంలు అశ్వత్థనారాయణ, గోవింద కారజోళ, ఎమ్మెల్సీ భోజేగౌడ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ఉన్నతితోనే దేశాభివృద్ధి

మహదేవపుర, జనవరి 21: సమాజంలోని అన్ని వర్గాల ఉన్నతితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. బెంగళూరు తూర్పు తాలూకాలో ఆదివారం ఏర్పాటైన అంబిగర చౌడయ్య 904వ జయంతిలో పాల్గొని మాట్లాడారు. నిజశరణ అంబిగర చౌడయ్య తత్వాలు, ఆదర్శాలు నేటికీ అనుసరణీయమన్నారు. కాగా పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా దేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేయాలన్నారు. కేఆర్ పుర ఎమ్మెల్యే భైరతి బసవరాజ్ మాట్లాడుతూ అంబిగర చౌడయ్య వచనాలు, జీవనం ఆదర్శప్రాయమన్నారు. సమాజంలోని లోటుపాట్లను నిర్భయంగా వచనాల ద్వారా ఆయన వ్యక్తం చేశారన్నారు. కాగా అంబిగ సామాజికవర్గం విద్య, ఆర్థిక సహా సర్వతోముఖాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో బెంగళూరు తూర్పు తాలూకా వెనుకబడిన బెస్త సంఘం ఆధ్వర్యంలో వెంగయ్యన చెరువు నుంచి కేఆర్‌పుర తాలూకా కార్యాలయం వరకు అంబిగర చౌడయ్య చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ప్రత్యేక తహసీల్దారు మహేశ్, కన్నడ పరిశోధకురాలు ధారవాడ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే మేల్‌కర్, బెంగళూరు తూర్పు తాలూకా వెనుకబడిన బెస్తర సంఘం అధ్యక్షుడు సీఎం నరసింహమూర్తి, కార్యదర్శి కే రవీంద్ర, ప్రముఖులు నటరాజ్, జీటీ వెంకటేశ్, హంచరహళ్ళి మంజునాథ్, అశ్వతప్ప, జీ నాగరాజ్, అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



అంబిగర చౌడయ్య జయంతిలో ఎమ్మెల్యే భైరతి బసవరాజ్, మంజుళా అరవింద లింబావళి

నేడు ఆలయ జీర్ణోద్ధరణ కుంభాభిషేకం

బొమ్మనహళ్ళి, జనవరి 21: స్థానిక రూపేన అగ్రహారలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణను పురస్కరించుకుని సోమవారం కుంభాభిషేకం జరుగనుంది. శని, ఆదివారాలలో ప్రత్యేక కైంకర్యాలు సాగాయి. ఆలయశుద్ధి, హోమాలు జరుగుతున్నాయి. 36మంది రుత్విక్కులు పాల్గొన్నారు. అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేళలోనే స్థానిక వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, ఆంజనేయ, వేదమాత గాయత్రి, నవగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణభట్ నేతృత్వంలో కైంకర్యాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే విగ్రహాలకు సంబంధించి జలాధివాసం, ధాన్యాదివాస ఇతరత్రా కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమాలను ఆలయ దాత, ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు దివంగత గోపాలరెడ్డి కుటుంబీకులు పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో నరేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.



విశేష హోమాలు నిర్వహిస్తున్న రుత్విక్కులతో నిర్వాహక బృందం

నేడు రాష్ట్రంలో ప్రభుత్వ సెలవుకు ససేమిరా

▸▸ లేఖ పంపిన ప్రతిపక్షనేత

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో రామలల్లా విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా కర్ణాటకలో ప్రభుత్వ సెలవుకు ససేమిరా అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవు ఇచ్చేది లేదని సీఎం సిద్ద రామయ్య స్పష్టం చేశారు. తుమకూరులో సీఎం మాట్లాడుతూ సోమవారం ప్రభుత్వ సెలవు లేదని అయితే దేవాదాయశాఖకు అనుబంధమైన అన్ని ఆలయాల్లోనూ పూజలు కొనసాగుతాయన్నారు. గడిచిన మూడు రోజులుగా బీజేపీ సెలవును ప్రకటించాలని డిమాండ్ చేస్తోంది. మాజీ సీఎం బొమ్మై, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, పరిషత్ ప్రతిపక్షనేత కోట శ్రీనివాసపూజారి సహా పలువురు డిమాండ్ చేశారు. శనివారం బెంగళూరులో సీఎం మాట్లాడుతూ సెలవు మంజూరు చేసే విషయం నిర్ణయించలేదని, నాకు ఎటువంటి లేఖలు రాలేదన్నారు. దీంతో ప్రతిపక్షనేత అశోక్ స్పందిస్తూ సీఎంకు లేఖ రాశారు. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలతోపాటు కేంద్ర ప్రభుత్వం పూర్తి లేదా అర్ధరోజును సెలవు ప్రకటించాయి. దేశంలోని ప్రముఖ కంపెనీ రిలయెన్స్ సెలవును ప్రకటించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో సెలవుకు ప్రభుత్వం ససేమిరా అంటోంది. సీఎం సిద్దరామయ్య ఇంకా నిర్ణయం తీసుకోలేదని, పరిశీలిస్తున్నామని వ్యాఖ్యానించగా డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ రాజకీయాల్లో మతం ఉండవచ్చునని, మత రాజకీయాలు సరికాదన్నారు. ఆలయాల్లో పూజలు జరుగుతాయన్నారు. దీన్నిబట్టి సోమవారం సెలవు మంజూరు చేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

శివకుమారస్వామిజీ సేవలు అమూల్యం

శిడ్లఘట్ట, జనవరి 21: ప్రజలందరికీ మార్గ దర్శకులుగా ఉన్న సిద్దగంగా మఠం అధ్యక్షుడు శివ కుమారస్వామిజీ మానవజాతికి అందించిన సేవలు అమూల్యమైనవని బెంగళూరు గ్రామీణ జిల్లా శరణు సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు, ఉపాధ్యాయుడు హెచ్‌ఎస్ రుద్రేశ్‌మూర్తి అభిప్రాయపడ్డారు. తాలూకా లోని చీమంగల ప్రభుత్వ పాఠశాలలో శివ కుమార స్వామిజీ పుణ్యస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత స్వామిజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం రుద్రేశ్ మూర్తి మాట్లాడుతూ విద్య, సాహిత్యం, సంస్కృతి రంగాలలోనే కాక ధర్మం, ఆధ్యాత్మిక రంగాలలో రాణించారన్నారు. త్రివిధ దాసోహిగా వందలాదిమంది విద్యార్థులను చక్కగా తీర్చిదిద్దుతున్నారన్నారు. ఈ శతాబ్ధపు అసాధారణ సామర్థ్యం కల్గిన వ్యక్తిగా నిలి చారన్నారు. అన్ని సద్గుణాలతో నడిచే దేవుడిగా కీర్తించ బడ్డారన్నారు. రెవెన్యూ శాఖ రిటైర్డు ఉద్యోగి పరమ శివయ్య మాట్లాడుతూ స్వామిజీ నిస్వార్థంగా సేవలం దించారని గుర్తు చేశారు. విద్యాశాఖ రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్ అజిత్ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించేందుకు ఎంతో కృషి చేశా రన్నారు. ఇదే సందర్భంగా వివిధ రంగాల సాధకులను ఆత్మీయంగా సత్కరించారు. తాలూకా అక్షరదాసోహ డైరెక్టర్ ఆంజనేయులు, ప్రధానోపాధ్యాయుడు శివశంకర్, సీనియర్ హరికథ విద్వాంసుడు జ్ఞానమూర్తి, ఉమేశ్ పద్మజా, ఉత్తమ ఉపాధ్యాయుడు ఎం శివకుమార్, నవీన్, శ్రీనివాస్, శంకర్, గౌతమ్, కవితా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు కాన్పు.. చిన్నారిని రక్షించిన కిండర్ వైద్యులు

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మహిళలు ఆరోగ్యవంతమైన బిడ్డల జననం కోసం ఆశిస్తారు. అయితే కిండర్ ఆసుపత్రికి 28 వారాల గర్భిణి ఆరోగ్య సమస్యలతో చేరారు. గర్భంలో కవల పిల్లలు ఉన్నారని వైద్యులు గుర్తించారు. రెండో శిశువును ఒకే ప్లెసెంటాతో కలసి ఉండడంతో రక్తం సక్రమంగా అందడం లేదని వైద్యులు నిర్ధారించారు. కాన్పు జరపగా 750 గ్రాముల బరువున్న కవల శిశువులు జన్మించారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్ సుశాంత్ నేతృత్వంలోని బృందం నిరంతర పర్యవేక్షణతో సేవలందించారు. తొలి శిశువు మెదడులో రక్తస్రావం జరిగి ప్రాణాలు కోల్పోయింది. రెండో శిశువు రక్తహీనత సమస్యతో ఉన్నా ఆధునాతన వైద్యవిధానాలు అందించారు. రెండు నెలలకు 1.98 కిలోల బరువుకు చేరుకుని ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయినట్టు కిండర్ ఆసుపత్రి వైద్యులు ప్రకటించారు.

ఓటరు చైతన్యంపై వ్యంగ్య చిత్రాల పోటీ



విధానసౌధ వద్ద జాగృతి కల్పిస్తున్న అధికారులు

బెంగళూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓటింగ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్) మనోజ్‌కుమార్ మీనా వ్యంగ్యచిత్రాల పోటీలను లాంఛనంగా ఆరంభించారు. లోక్‌సభ ఎన్నికల వేళ పోలింగ్‌శాతం పెంచే దిశగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పోటీలు నిర్వ హించామన్నారు. విధానసౌధ ఎదుట ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు తమ చిత్రా లను ప్రదర్శించారు. ఎన్నికల విభాగం స్పెషల్ కమి షనర్ రామచంద్రన్, స్వీప్ నోడల్ అధికారి పీఎస్ వస్త్రద్, ఐటీ విభాగం అధికారి సూర్యసేన్‌లు పాల్గొన్నారు. 25 వ్యంగ్య చిత్రాలను ప్రదర్శింప చేశారు. విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చాటుకున్న వారికి బహుమతులు ప్రదానం చేసి ప్రోత్సహించారు.